పొలం గట్టు ఆదాయం తెచ్చిపెట్టు
- కూరగాయలు సాగుచేస్తున్న బొబ్బిలి మండల రైతులు


6లో

వైభవం.. తెప్పోత్సవం




పెద్దచెరువులో హంసవాహనం, ఇన్‌సెట్‌లో పూజలందుకుంటున్న పైడిమాంబ ఉత్సవ విగ్రహం

పైడిమాంబ తెప్పోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. పెద్దచెరువులో హంస వాహనంపై విహరిస్తుండగా నలువైపులా నుంచి భక్తులు కన్నులార్పకుండా వీక్షించారు. చెరువు గట్టు పైనుంచి వేలాదిగా చూస్తూ ఆ కమనీయ దృశ్యాలను సెల్‌ఫోన్లతో చిత్రీకరించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద చెరువులో నిర్దేశించిన ప్రాంతంలో మూడు పర్యాయాలు పైడితల్లి విహరించారు. 6లో


తెప్పోత్సవాన్ని పెద్దచెరువు గట్టు పైనుంచి వీక్షిస్తూ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీస్తున్న భక్తులు

మొక్కజొన్న కొనేదెవరు?

- భామిని మండలంలో విస్తారంగా సాగు
- చేతికందిన పంట
- కొనుగోలుదారులు లేక రైతుల దిగాలు




భామినిలో మొక్కజొన్నను ఆరబెట్టిన దృశ్యం, యంత్రంలో గింజలు సేకరిస్తున్న రైతులు

భామిని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన పంట వరి. రెండో ప్రాధాన్యతగా పత్తిని రైతులు సాగు చేస్తుంటారు. అయితే, ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పత్తికి బదులు మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. ఘనసర, సతివాడ, చిన్నదిమిలి, బాలేరు, దిమ్మిడిజోల, భామిని, పసుకుడి, సింగిడి, బిల్లుమడ తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉంది. వాతావరణం అనుకూలంగా లేకపోయినా ఎలాగో నెట్టుకొచ్చారు. ఇటీవల భారీ వర్షాలకు పంట నేలమట్టమైంది. దీంతో గింజలకు మొలకలు వస్తాయనే భయంతో రైతులు ఆదరాబాదరాగా పంటను సేకరించారు. యంత్రాల ద్వారా పిక్కలు సేకరించి వీధులు, రోడ్లపై ఆరబెడుతున్నారు. అయితే, ఇప్పటికీ పంట అమ్ముడుకాక రైతులు ఇబ్బందులు (మిగతా 8వ పేజీలో..)

ఇంకెప్పుడిస్తారో?

- గిరిజన రైతులకు అందని రాయితీ వ్యవసాయ పరికరాలు
- ఐదేళ్లుగా ఎదురుచూపు
- ఐటీడీఏకు దరఖాస్తుల వెల్లువ

సీతంపేట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని 28 గిరిజన ఉపప్రణాళిక మండలాల్లోని గిరిజన రైతులకు గత ఐదేళ్లుగా రాయితీపై హార్టికల్చర్, అగ్రికల్చర్ యంత్రాలు, పరికరాలు అందడం లేదు. దీంతో వారు ఆధునిక వ్యవసాయ పద్ధతులకు దూరమవుతున్నారు. గిరిజన రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం 2019-20ఏడాదిలో ఎస్‌సీపీ టు టీఎస్‌ఎస్ (కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కాంపోనెంట్ నిధులు) కింద పార్వతీపురం ఐటీడీఏకు రూ.2.3కోట్లు, సీతంపేట ఐటీడీఏకు రూ.2.60కోట్లు నిధులు కేటాయించింది. ఈ నిధులతో ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, పవర్‌టిల్లర్లు,


టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పవర్‌వీడర్‌తో దమ్ము చేస్తున్న గిరిజన రైతు (ఫైల్)





వీడర్లు, టార్పలిన్‌లు వంటి వ్యవసాయ యంత్ర, పరికరాలను 90శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు అందించాల్సి ఉంది. కానీ, ఈ నిధులు వినియోగించకపోవడంతో ఐటీడీఏల ఖజానాల్లోనే అవి మూలుగుతున్నాయి. నిధులు ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని ఐటీడీఏ అధికారులు చెబుతుండడం గమనార్హం.

ఎందుకిలా?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 వరకూ గిరిజన రైతులకు సకాలంలో వ్యవసాయ యంత్రాలు, పరికరాలు 90 శాతం రాయితీపై అందేవి. వీటిని వినియోగించుకొని గిరిజనులు ఖరీఫ్, రబీ సీజన్లలో ఆధునిక సాగు చేసి ఆర్థికంగా లాభపడేవారు. అయితే, 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం రాయితీ యంత్రాల పంపిణీపై నిర్లక్ష్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌సీపీ టు టీఎస్‌ఎస్ నిధులను ఐటీడీఏల ద్వారా ఖర్చు చేయకుండా, సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానాన్ని కూడా జగన్ ప్రభుత్వం అమలు చేయలేక చేతులెత్తేసింది. దీంతో రాష్ట్రంలో ఉన్న అన్ని ఐటీడీఏల్లో ఎస్‌సీపీ టు టీఎస్‌ఎస్ నిధులు నేటికీ మూలుగుతూనే ఉన్నాయి. రాయితీ వ్యవసాయ (మిగతా 8వ పేజీలో..)

ప్రతిపాదనలు పంపాం

వ్యవసాయ పరికరాల కోసం గిరిజన రైతుల నుంచి డిమాండ్ ఎక్కువగానే ఉంది. వీటికోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే హార్టికల్చర్, అగ్రికల్చర్ పరికరాలను రైతులకు రాయితీపై పంపిణీ చేస్తాం.

-ఆర్‌వీ గణేష్, హార్టికల్చర్ ప్రాజెక్ట్ అధికారి

ప్రతి రైతూ వ్యాపారవేత్తగా ఎదగాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సాలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి రైతూ వ్యాపారవేత్తగా ఎదగాలి. ఆ దిశగా అధిక దిగుబడి, రాబడి వచ్చే పంటల వైపు మొగ్గుచూపాలి.' అని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడిపల్లి రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖాధికారు లతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించా రు. ఇక్కడి రైతులు చాలా ఆదర్శవంతంగా వ్యవసాయం చేస్తున్నారని, సంప్రదాయ పద్ధ తుల్లో పంటల్ని పండించడమే కాకుండా అంతర్ పంటలపై కూడా మంచి అవగాహన ఉందని కితాబిచ్చారు. రైతుల ఆదాయ, వ్యయ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేయాలన్నారు. వారి ఆదాయం పెంచేందుకు సరైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సాలూరు (మిగతా 8వ పేజీలో..)


మామిడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కలెక్టర్‌కు అరుదైన గౌరవం

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ నుంచి అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 27, 28 తేదీల్లో ముస్సోరిలో కలెక్టర్లతో జరిగే ఎన్‌కేఎస్‌హెచ్‌ఏ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్‌ను ఆహ్వానించింది. రెండు రోజుల శిక్షణ, వర్క్‌షాప్‌కు హాజరై కలెక్టర్లకు శిక్షణ ఇవ్వాలని కోరింది. రెవెన్యూ, సర్వే, భూ రికార్డులు వంటి భూపరిపాలన వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై దేశంలోనే అత్యంత అనుభవం, మంచి పరిజ్ఞానం కలిగిన అధికారిగా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి మంచి పేరు ఉండడంతో ఆయనను ఈ మేరకు ఆహ్వానించింది.

సమ్మెలో వైద్యులు.. రోగులకు అవస్థలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని సేవలు
- ఆరు రోజులుగా ఇదే పరిస్థితి

6లో

కల్తీ మద్యం ఆనవాళ్లు లేవు
- ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు

6లో

ఎన్నాళ్లీ అవస్థలు?
- రహదారిపై మురుగునీరు
- పురమిత్రలో ఫిర్యాదు చేసినా స్పందించని యంత్రాంగం

6లో

మెట్ల మీద నుంచి జారిపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు

మక్కువ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్ఎన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మంగళవారం సాయంత్రం స్కూల్ భవనం మెట్ల మీద నుంచి జారిపడి గాయపడ్డారు. కొవ్వాడ భార్గవ్, చైతన్య అనే ఇద్దరు మూడో తరగతి విద్యార్థులు పాఠశాల పైఅంతస్తు నుంచి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డారు. ఈ ఘటనలో భార్గవ్ చేయి విరిగిపోవడంతో ఉపాధ్యాయులు బాలుడ్ని పార్వతీపురం మండలం సంగంవలసలోని ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి కట్టుకట్టించారు. చైతన్యకు నుదుటిపై గాయం కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించగా వైద్యులు మూడు కుట్లు వేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గోప్యంగా ఉంచారు. ఎంతసేపో పాటు పాఠశాల హెచ్‌ఎంను వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా వారి స్విచ్ఛాఫ్ వచ్చాయి.


చేతికి కట్టుతో భార్గవ్

రోడ్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించండి

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాలకు అంబులెన్సులు వెళ్లేలా రహదారుల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. జేఈలు క్షేత్రస్థాయిలో రహదారులను పరిశీలించి వీడియోలు, ఫొటోలు తీయాలన్నారు. ఇప్పటికే కలెక్టర్ కొన్నింటిని పరిశీలించారని తెలిపారు. మిగిలిన వాటిని కూడా పరిశీలిస్తారని చెప్పారు. అంచనాలు పక్కాగా ఉండాలన్నారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ సమావేశంలో నగేష్‌బాబు, జేఈలు పాల్గొన్నారు.

శరవేగంగా..

- పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు
- ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ
- పూర్తయిన రైల్వే కార్యాలయ నూతన భవనం


ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న అత్యాధునిక భవనం

బెలగాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రైల్వేస్టేషన్ (బెలగాం)లో ఆధునికీకరణ పనులు చకాచకా జరుగుతున్నాయి. అమృత్ భారత్ పథకం కింద ఈ స్టేషన్ ఎంపికైంది. ఫేజ్1లో భాగంగా సుమారు రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టికెట్ కౌంటర్, ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఆధునిక క్యాంటీన్లు, వాణిజ్య సముదాయాలు, అత్యాధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు, సామాన్లు భద్రపరుచుకునే గదులు, రెస్టారెంట్ తదితర భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్లాట్‌ఫామ్‌లను ఆధునికీకరిస్తున్నారు. రైల్వే సిబ్బంది కోసం చాకలి బెలగాం (ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్) వైపు రైల్వే కార్యాలయ నూతన భవనం నిర్మించారు. ఆ భవనంలోనే స్టేషన్ మాస్టర్ విధులు నిర్వహిస్తున్నారు. ఎస్కలేటర్, నాలుగు లిఫ్టులు, ఇంకొక ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది.


పార్వతీపురం నూతన రైల్వే కార్యాలయ భవనం

వీటిపై దృష్టి సారించాలి..

స్టేషన్‌లో మొత్తం ఐదు ప్లాట్‌ఫామ్‌లు వినియోగంలో ఉన్నాయి. అమృత భారత్‌లో భాగంగా కొత్తగా నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి తో ప్రయాణికులకు కొంత ఇబ్బందిగా ఉంది. బాగా ఎత్తుగా ఉండడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు బ్రిడ్జి పైకి ఎక్కేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఏటవాలుగా ఉండడంతో (మిగతా 8వ పేజీలో..)

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువు

- అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు
- కనీస సదుపాయాలు కరువు
- స్థల పరిశీలనకే పరిమితమైన కలెక్టరేట్ నిర్మాణం


కలెక్టరేట్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా చాలా ప్రభుత్వ కార్యాలయాలకు ఇంకా సొంత గూడు లేదు. అద్దె భవనాల్లోనే వాటిని నిర్వహించాల్సి వస్తోంది. నేటికీ నూతన కలెక్టరేట్ నిర్మాణానికి నోచుకోలేదు. కేవలం స్థల పరిశీలన చేసి వదిలేశారే తప్ప పనులకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో గతంలో ఐటీడీఏ కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓ ప్రైవేటు భవన సముదాయంలో సుమారు 30 ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా రిజిస్ట్రేషన్, తదితర ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ భవనాల్లో కనీస మౌలిక సౌక ర్యాలు కరువయ్యాయి. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో సంబంధిత అధికారులు, సిబ్బందితో పాటు పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టరేట్ నిర్మాణమెప్పుడో?

పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద కలెక్టరేట్ నిర్మాణం కోసం 60 ఎకరాలను గతంలో కేటాయించారు. పక్కా భవనాలతో నూతన కార్యాలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఈ స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే, గత మూడేళ్లుగా అధికారులు రావడం, ఈ స్థలాన్ని పరిశీలించి వెళ్లిపోవడమే తప్ప కలెక్టరేట్ నిర్మాణానికి (మిగతా 8వ పేజీలో..)

వైభవం.. తెప్పోత్సవం

హంస వాహనంపై పైడితల్లి విహారం


తెప్పోత్సవం కోసం పెద్ద చెరువు వద్దకు చేరుకున్న భక్తులు

విజయనగరం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ మంగళవారం పెద్దచెరువులో హంస వాహనంపై విహరించారు. పైడిమాంబ సిరిమానోత్సవంలో భాగంగా తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం పైడితల్లికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. సిరిమానోత్సవంలో భాగంగా ఏటా తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, నగర పాలక సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో శిరీష, అర్చకులు, సిబ్బంది, పైడిమాంబ భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద చెరువులో నిర్దేశించిన ప్రాంతంలో మూడు పర్యాయాలు పైడితల్లి విహరించి... చెరువుకు ఇరువైపులా తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులకు కనువిందు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పైడిమాంబ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఉత్సవ విగ్రహం ఊరేగింపు

అంతకుముందు తెప్పోత్సవానికి అమ్మవారిని సిద్ధం చేశారు. మేళతాళాలు.. వేదమంత్రోచ్చారణలు ఒకవైపు.. జై పైడిమాంబ.. జై జై పైడిమాంబ అంటూ భక్తుల నామస్మరణల హోరు మరోవైపు.. ఆ నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి నుంచి పెద్ద చెరువు వెనుకభాగాన గల ప్రాంతానికి తీసుకువెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న హంస వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచారు. అనంతరం తెప్పోత్సవం ప్రారంభమైంది.




తెప్పను అనుసరిస్తున్న అర్చకులు, భక్తులు

కల్తీ మద్యం ఆనవాళ్లు లేవు

- ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు



విజయనగరం క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో కల్తీ మద్యం ఆనవాళ్లు లేవని... మద్యం అమ్మకాలు గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 17 శాతం పెరిగాయని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి. శ్రీనాథుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయాల వద్ద చేసిన నిరసన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం పాలసీ ప్రకారం నవోదయం, అనధికార మద్యాన్ని నిర్మూలించడం, ఎంఆర్‌పీకే మద్యం విక్రయించడం వంటి ప్రధాన లక్ష్యాలను అమలు చేస్తున్నామన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా 84 కేసులు ఈ ఏడాది నమోదు చేసి, 84 మందిని అరెస్టు చేశామన్నారు. 1,330 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 214 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనధికార మద్యం దుకాణాలపై నిత్యం దాడులు నిర్వహించి, సంబంధిత వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది 1,050 మందిని అరెస్టు చేసి పట్టుబడ్డ మద్యం నమూనాలను విశాఖపట్నంలోని లేబోరేటరికీ పంపించి నివేదికలు తెప్పించామని తెలిపారు. ఏ ఒక్క కేసులోనూ కల్తీ ఆనవాళ్లు లభించలేదన్నారు. ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, దీనిలో రిటైలర్స్ వివరాలు, మద్యం ధర, నాణ్యతను తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయండి: డీపీవో

చీపురుపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు ఆదేశించారు. మంగళవారం చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు విడతల్లో జరగాల్సిన సర్వేకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లా అధికారులు పూర్తిగా అందజేస్తారన్నారు. గ్రామ కంఠాలు, నివాస ప్రాంతాలు, ఖాళీ స్థలాలపై సమగ్రంగా సర్వే చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి ఎంపీడీవో ఐ.సురేష్, డెప్యూటీ ఎంపీడీవో టి.ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్టు.. ఆదాయం తెచ్చిపెట్టు

- కూరగాయలు సాగుచేస్తున్న రైతులు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సరిగా ఆలోచించాలే గానీ పొలం గట్లనూ ఆదాయ మార్గంగా మార్చుకోవచ్చని చాటిచెబుతున్నారా రైతులు. ప్రస్తుతం కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇది ఆర్థికంగా భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ పంటలు పండిస్తూనే... రోజువారీ ఖర్చుల కోసం...ఇంటి అవసరాలు తీర్చుకోవడం కోసం కూరగాయలు పండిస్తున్నారా రైతులు. బొబ్బిలి మండలం పెంట, జగన్నాథపురం, అలజంగి గ్రామాలలో రైతులు ఇలా పొలం గట్లపై సాగు చేస్తూ ఎంతో కొంత కళ్ల చూస్తున్నారు. గట్లపై ఖాళీ స్థలాన్ని వదిలేయకుండా దొండ, బీర వంటి పాదులను పెంచుతున్నారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, పెసర, తదితర పంటలను సాగు చేస్తుంటారు. అధిక పెట్టుబడులు పెట్టి ఫలితాలు పొందాలంటే సమయం పడుతుంది. దీంతో బీర, చిక్కుడు వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. తీగ జాతి కూరగాయల కోసం చిన్న పందిళ్లు వేస్తున్నారు. వీటి వల్ల ఎప్పటికప్పుడు డబ్బులు చేతికి అందుతున్నాయని... ఖర్చులకు ఇబ్బందులు తప్పాయని చెబుతున్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ... మార్పులు చేసుకుంటూ ముందుకెళితే లాభాలు పొందవచ్చని అభిప్రాయపడుతున్నారు.


పెంట గ్రామంలో పొలం గట్టుపై ఉన్న బీర పాదు


జగన్నాథపురంలో...

అదనపు ఆదాయం కోసం...

నాది పెంట గ్రామం. పొలం గట్ల మీద చిక్కుడు, బీర వేశాను. ఎనిమిదేళ్లుగా ఇలా పండిస్తున్నాను. వరి పంట కోతకు వచ్చే ముందే ఈ కూరగాయలు కాపునకు వస్తాయి. ఈ పంట వల్ల అదనపు ఆదాయం లభిస్తుంది. ఇలా కూరగాయలు సాగు చేయడం వల్ల పశువులు గట్టు దాటి.. వరి పంటను పాడు చేసే ప్రమాదమూ తప్పుతుంది. ఇంటి అవసరాలకు సరిపడా వాడుకొని, మిగతావి బజార్లో అమ్ముకుంటాం. నాకు ఉన్న నాలుగు ఎకరాలలో గట్ల చుట్టూ ఈ కూరగాయలు పంట వేశాను. రోజుకి రెండు నుంచి 10 కేజీల కూరగాయలు బజార్లో అమ్ముతున్నాం.

-బేతనపల్లి కృష్ణమూర్తి

సమ్మెలో వైద్యులు.. రోగులకు అవస్థలు

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని సేవలు
- ఆరు రోజులుగా ఇదే పరిస్థితి


గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు

గంట్యాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సమ్మె బాట పట్టడంతో ఆస్పత్రులకు వెళ్లే రోగులు అవస్థలు పడుతున్నారు. గత ఆరు రోజులుగా వైద్యులు నిరసనకు దిగడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి పీజీ ప్రవేశాల్లో రిజర్వేషన్‌ను 30 నుంచి 15 శాతానికి తగ్గించడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి డాక్టర్లు తమ విధులను పక్కన పెట్టి సమ్మెలోకి వెళ్లారు. అప్పటి నుంచి ప్రాథమికఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వివిధ సమస్యలపై వస్తున్న వారికి కొన్ని ఆసుపత్రుల్లో ఫార్మసిస్టులు చికిత్స చేసి... మందులు పంపిణీ చేస్తున్నారు. అధికశాతం కేసులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు మొత్తం 68 ఉన్నాయి. వీటిలో 106 మంది వైద్యులు పని చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 50 నుంచి 90 ఓపీలు ఉంటున్నాయి. ప్రస్తుతం జ్వరాలు, జలుబు, దగ్గు వంటి సమస్యలతో ఎక్కువ మంది వస్తున్నారు. డాక్టర్లు సమ్మెలోకి వెళ్లిన తరువాత కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తాత్కాలిక వైద్యులను నియమించినా అనుకున్నంత స్థాయిలో సేవలు అందడం లేదు. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. దీంతో అధికశాతం రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇది వారికి ఆర్థికంగా భారంగా మారుతోంది.

డాక్టర్లు లేకపోవడంతో ఇబ్బంది..



మా సమస్యలు చెప్పుకోవడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉంటోంది. ప్రత్యేకంగా మా గ్రామం నుంచి ఆసుపత్రికి వచ్చిన తరువాత వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వేరేచోటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాం. చాలా మంది ఇలాగే ఇబ్బంది పడుతున్నారు.

-జి.శ్రీను, రావివలస

తాత్కాలికంగా నియమించాం..

వైద్యులు సమ్మె చేయడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జిల్లా కేంద్రంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వైద్యులను పంపించాం. జిల్లాలోని నాలుగు, ఐదు కేంద్రాలకు తప్ప మిగిలిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తాతాల్కింగా వైద్యులను నియమించి సేవలు అందిస్తున్నాం. పూర్తి స్థాయిలో డాక్టర్లు లేకపోవడం వల్ల కాస్త ఇబ్బంది గానే ఉంటోంది.

-జీవనరాణి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని... సారా, అనధికార మద్యం రహిత జిల్లాగా విజయనగరం ఉండాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అన్నారు. బెల్ట్‌షాప్‌లను కూడా గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం రాత్రి ఎస్పీతో కలసి ఎక్సైజ్ అధికారులతో అక్రమ మద్యం నివారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ గట్టి నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో దాడులు చేయాలని, తక్షణమే బెల్ట్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నాటు సారా తయారీలో వినియోగించే నల్ల బెల్లం విక్రయించే వారిని వెంటనే అరెస్టు చేయాలని, నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, డీప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

అవార్డుల సాధనకు కృషి చేయాలి..

జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డుల సాధన కోసం కృషి చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీని కోసం ప్రభుత్వ శాఖలన్నీ తమ పనితీరును గణనీయంగా మెరుగుపర్చుకోవాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల సామర్థ్య సూచికలపై ఆయన సమీక్షించారు. జిల్లాలో 146 ఇండికేటర్లు ఉంటాయని, వాటిని కచ్చితమైన వివరాలతో నింపాలని ఆదేశించారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

- రహదారిపై మురుగునీరు
- పురమిత్రలో ఫిర్యాదు చేసినా స్పందించని యంత్రాంగం

ఈ చిత్రం చూశారా? ఇది మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి నగర్‌లోని దృశ్యం. గత నాలుగేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిసినా ఇలా రోజుల తరబడి రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోతోంది. ఫలితంగా కాలనీవాసులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వందలాది మంది నరకయాతన అనుభవిస్తున్నారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం.... రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీటితో పాటు పరిసర ప్రాంతాలలోని ఇళ్లల్లో వినియోగించే మురుగునీరంతా నేరుగా ఈ రహదారి పైకి చేరుతోంది. దీంతో కాలనీవాసులకు అవస్థలు తప్పడం లేదు. రోజుల తరబడి మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమల జోరు పెరిగి తరచూ కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో తిరుగాడే వాహనాలతో రోడ్డు పైన ఉన్న మురుగు నీరంతా కాలనీలోని ఇళ్లలోకి చేరుతోంది. ఫలితంగా మహిళల అవస్థలు వర్ణనాతీతం. చిన్నపాటి చినుకుపడినా కాలనీవాసులు భీతిల్లుతున్నారు. శ్రీకాకుళం రోడ్డు నుంచి సారధి గ్రామానికి రాకపోకలు సాగించే వందలాది మందితో పాటు బాలికల పాఠశాల, కళాశాలకు వెళ్లివచ్చే విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని.. రహదారి నిర్మాణం చేపట్టాలని పురమిత్రలో ఫిర్యాదు చేసినా... మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని కాలనీవాసులంతా హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని రాజాం మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

-రాజాం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)


ప్రశాంతి నగర్‌లో రహదారిపై నిలిచిన మురుగునీరు

పర్యావరణాన్ని కాపాడాలని..

- 100 కొబ్బరి మొక్కలు నాటిన పాటూరు వాసులు


రాజు చెరువు గట్టుపై కొబ్బరి మొక్క నాటుతున్న దృశ్యం

వేపాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు పాటూరు గ్రామస్థులు నడుం బిగించారు. గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రదేశాలలో సుమారు 100 కొబ్బరి మొక్కలు నాటారు. రాజు కోనేరు గట్టుపై కొబ్బరి మొక్కలను నాటడంతో పాటు వాటి పరిరక్షణకు కంచెలు ఏర్పాటు చేశారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వారు చెబుతున్నారు. స్థానిక సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు రమణమూర్తి, అయ్యప్ప స్వాములు కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామం అంతా పచ్చదనంతో నిండాలని ఆకాంక్షించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కనాటి.. దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లు మానవులకు జీవనాధారమని.. అందుకే వాటిని విరివిగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేడు మెరకముడిదాం ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం

మెరకముడిదాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం, గుర్ల మండలాలకు సంబంధించి ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బుధవారం భైరిపురం ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కళావెంకటరావు ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

పాఠశాలల సందర్శన

వేపాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం, సోంపురం, నీలకంఠరాజపురం జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంఈవోలు పి.బాలభాస్కరరావు, ఎన్.నాగభూషణరావులు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇంగ్లీషు ప్రైమరీ పరీక్షలను పరిశీలించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మలేరియా కేసులపై ఆరా



వైద్యులతో మాట్లాడుతున్న ఫ్యామిలీ వెల్ఫేర్ ఏడీ వరుణ్

ఎస్.కోట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట సీహెచ్‌సీతోపాటు మరుపల్లి గ్రామాన్ని ఫ్యామిలీ వెల్ఫేర్ ఏడీ వరుణ్ మంగళవారం సందర్శించారు. జిల్లా మలేరియా అధికారిణి మణి ఆధ్వర్యంలో ఎస్.కోట సీహెచ్‌సీని సందర్శించి అక్కడ జ్వరపీడితులతో మట్లాడారు. గత ఏడాది, ఈ ఏడాది నమోదైన మలేరియా కేసుల వివరాలను సేకరించారు. అనంతరం బొడ్డవర పంచాయతీ గిరిజన గ్రామం మరుపల్లిలో ఈ మధ్యకాలంలో 8 మలేరియా కేసులు నమోదు కావడంతో ఈ గ్రామం వెళ్లారు. అక్కడ వైద్య శిబిరాలు, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు లేవని సీహెచ్‌వో వేణుగోపాలరావు, సిబ్బంది రమణ తదితరులు తెలియజేశారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



బాణసంచా విక్రయ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజాం/ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.రాజశేఖర్, సీఐ కె.అశోక్‌కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి పి.అశోక్ హెచ్చరించారు. రాజాంలోని బాణసంచా విక్రయ కేంద్రాలను వారు మంగళవారం తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా బాణసంచా తయారు చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. బాణసంచా సామగ్రి అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అనంతరం హోల్‌సేల్ విక్రయ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద సేఫ్టీ సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు.

తహసీల్దార్‌పై దాడి అమానుషం

రాజాం/రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణపై ఒక మహిళా దౌర్జన్యం చేయడం అమానుషమని రాజాం తహసీల్దార్ ఎం.రాజశేఖర్, దళిత సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత నాయకులు డి.రామప్పడు, బొత్స జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో సుందరకాండ పారాయణం



సుందరకాండ పారాయణం చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎంఎస్.రామారావు గానం చేసిన సుందరకాండను రామతీర్థం రామస్వామి దేవస్థానంలో మంగళవారం విశాఖపట్టణం వాస్తవ్యులు సరిపల్లి భాస్కరమ్మ, వారి శిష్యబృందంతో గానం చేశారు. ఈ బృంద సభ్యులు వివిధ దేవాలయాలు, క్షేత్రాల్లో 108 సార్లు సుందరకాండను పారాయణం చేస్తుంటారు. ముందుగా రామతీర్థంలో ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు సార్లు పారాయణం చేశామని భాస్కరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమలో 50 మంది భక్తులు పాల్గొన్నారు. వీరందరికీ దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వై.శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లు చేశారు.

రహదారి సదుపాయం కల్పించరూ..

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న సిరిపురం ఎస్సీ కాలనీ వాసులు

గంట్యాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామంలో ఎస్సీ కాలనీకి రహదారి సదుపాయం లేకపోవడంతో ఆ కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్డు నుంచి కాలనీకి వెళ్లేందుకు రహదారి లేదు. కాలనీకి రోడ్డుకు మధ్యలో చెరువు ఉండటంతో దీనిని దాటి వెళ్లాలి. గతంలో ఏర్పాటుచేసిన బ్రిడ్జి వద్ద పెద్ద గొయ్యి ఏర్పడటంతో ఇప్పుడు కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ రహదారి నుంచి వెళ్లడానికి కాలనీవాసులు తాత్కాలికంగా మట్టి వేసి కప్పినా, వర్షం నీరు అధికంగా రావడం వల్ల ఎప్పటికప్పుడు మట్టి కొట్టుకుపోతుంది. ఈ సమస్యతో కాలనీవాసులకు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ఇదీ ఎస్సీ కాలనీకి వెళ్లే దారి దుస్థితి

విశాఖకు గూగుల్ రాకపై హర్షం

నెల్లిమర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ సెంటర్ రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో మంగళవారం బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచుకున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● విజయనగరం రూరల్: విశాఖకు గూగుల్ సంస్థ రానున్న నేపథ్యంలో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి సంబరాలు జరిపారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో బాణసంచా కల్చారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: ఎమ్మెల్యే అదితి ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తున్న దృశ్యం



గజపతినగరం: హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు



నెల్లిమర్ల: టీడీపీ నాయకుడు రవిశేఖర్‌కు స్వీటు తినిపిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

● గజపతినగరం: విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తున్నా సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద టీడీపీ నాయకులు బాణసంచా కల్చారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, టీడీపీ దత్తిరాజేరు అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, గంట్యాడ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కరనాయుడు, గుంత్రోతు గోవింద, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఐటీ హబ్‌గా మారనున్న విశాఖ

● ఎమ్మెల్యే కళా వెంకటరావు



విజయనగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ చొరవతో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖ ఐటీ హబ్‌గా మారనుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం విజయనగరంలోని జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడానికి మంత్రి లోకేశ్ కృషి ఉందన్నారు. వైసీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ 16 సార్లు మోదీని కలవటానికి వెళ్లారని, ఒక్క పరిశ్రమ కూడా తేలేకపోయారని ఆయన విమర్శించారు. మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి టీసీఎల్, షిఫీ, ఇప్పుడు గుగూల్ డేటా సెంటర్ వంటి విదేశీ కంపెనీలు ఏర్పాటుకు ఒప్పందం కుదరటంతో నిరుద్యోగ యువత సంబరాలు చేసుకుంటున్నారన్నారు. విద్యాశాఖ మంత్రిగా విద్యా వ్యవస్థలో కూడా సమూలమైన మార్పులు తీసు కువచ్చి, అందరికీ నాణ్యమైన విద్య అందే విధంగా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. అన్ని వనరులు ఉన్నా భోగాపురం విమానాశ్రయం ఎందుకు ఆగిందో జగన్ చెప్పాలన్నారు. రానున్న రోజుల్లో ఆర్థిక రాజధాని గా విశాఖ అభివృద్ధి చెందుతుందన్నారు. గూగుల్‌ను ఉత్తరాంధ్రకు తెచ్చినందుకు ముఖ్యమంత్రికి, లోకేశ్‌కు ఈ ప్రాంతవాసిగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేట్, మతతత్వ శక్తులను తరిమికొట్టాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు పిలుపునిచ్చారు. డిసెంబరు 6, 7 తేదీల్లో కడపలో జరగనున్న సీపీఐఎంఎల్ రాష్ట్ర మహాసభలకు సంబంధించి మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుసంధానంలో కొనసాగుతున్న మోదీ ప్రభుత్వం దేశ సంపదను విదేశీ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అప్పలరాజు, సత్యారావు, గౌతమి, సన్యాసిరావు, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



నిర్వాహకులతో ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలో ఈనెల 17, 18 తేదీలలో నిర్వహించనున్న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పీడీ పి.శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల ఏర్పాట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. అండర్ 14, 17 విభాగంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, చెస్, బాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు పీడీ శ్రీరాములు తెలిపారు.

సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

భోగాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నుంచి విక్రయిస్తున్న మద్యం నాణ్యమైందా.. కాదా.. అని తెలుసుకోవడానికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు అన్నారు. భోగాపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మద్యం దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. అలాగే శాంపిల్స్‌ను తీసుకుని, విశాఖ రీజనల్ లేబరేటరీకి పంపించాలని సూచించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే కళా విజ్ఞప్తి

చీపురుపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 80 శాతం మంది రైతులున్నారని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన విజయనగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా జిల్లాతో పాటు చీపురువల్లి నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడారు. రైతు కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆయన ప్రాధాన్యతాంశాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల కింద మరింత ఆయకట్టుకు సాగు నీరందేలా చూడాలన్నారు. ప్రాజెక్టులకు ఎగువనున్న ప్రాంతాలకు కూడా నీటిని తరలించేందుకు కృషి చేయాలన్నారు. ఇటీవల ఎరువుల పంపిణీ తలెత్తిన గందరగోళాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ వివరించారు. సరిపడినన్ని ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, కొంతమంది కారణంగా యూరియాకు కృత్రిమ కొరత ఏర్పడిందన్నారు. ఇటువంటి సమన్వయ లోపాలను సవరించి జిల్లా ప్రజలకు అన్ని విధాలా మేలు జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సన్యాసినాయుడు ఉన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

విజయనగరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. అంబేడ్కర్ రైట్స్ ఫోరం రూపొందించిన కరపత్రాలను ఆయన మంగళవారం విజయనగరంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణ త్యాగం చేసిన 32 మంది అమరవీరులను ప్రైవేటీకరణ ద్వారా ప్రభుత్వం అవమాన పరుస్తుందన్నారు. సమితి ప్రతినిధులు ప్రభాకరరావు, వెంకటేష్, రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ● గరివిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణం విరమించు కోవాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గరివిడిలో తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం చీపురుపల్లి నియోజకవర్గ స్థాయి వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రులు పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలో కొనసాగాలని డిమాండ్ చేశారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నాలుగు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలన్నీ నీటి మూటలేనా?

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు నీటి మూటలేనా అని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ప్రశ్నించారు. అమర్‌భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను నమ్మించి గెలిచిన తర్వాత నట్టేట ముంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా, నిరుద్యోగ భృతిపై ప్రకటన లేదని విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల శాఖ మంత్రిగా బాధ్యతలు విస్మరించి, కార్పొరేట్, ప్రైవేటు సంస్థలకు సీఈవోగా వ్యవహరిస్తున్నారని విమర్శించా రు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, శ్రీనివాసరావు, నాగభూషణం, అప్పన్న, వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు

వైద్యుల సమ్మెకు మద్దతు

సంతకవిటి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం నిరసన బాట పట్టింది. ఈ సమ్మెకు మద్దతుగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

జీపీ అప్పారావు చిత్రపటంతో రిలే దీక్ష



గొర్రిపాటి చిత్రపటంతో రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి నీటిని పూర్తి స్థాయిలో తాగు, సాగుకు కేటాయించినప్పుడే ఆ రిజర్వాయర్‌ను నిర్మించిన గొర్రిపాటి బుచ్చి అప్పారావుకు ఘన నివాళి అని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు చేస్తున్న 116వ రోజు నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వేల ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు తాటిపూడి రిజర్వాయర్‌ను నిర్మిస్తే ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కులకు ఈ నీరు ఇచ్చి ఈ ప్రాంత భూములను బీడు చేసే కుట్ర జరుగుతుందన్నారు. దీనిని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అనంతరం గొర్రిపాటి చిత్రపటంతో వారు రిలే దీక్షను కొనసాగించారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకూ మేలు

విజయనగరం రూరల్/ రింగురోడ్డు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకూ మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వ ర్యంలో స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని తగ్గించడం ద్వారా నిరుపేద, పేద, మధ్యతరగతి, ధనిక వర్గాలకు ఎంతో మేలు చేకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రబోస్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

● నెల్లిమర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. నెల్లిమర్ల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గృహోపకరణాలపై 28 నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించడంతో మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బంగారు సరోజిని, కరుమోజి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, కోరాడ రమేష్, కమిషనర్ జయరావు, ఎంపీడీవో రామకృష్ణరాజు, ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

బొబ్బిలి/ సాలూరు రూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడిపేట పంచాయతీ పరిధిలోగల కృపావలసకు చెందిన విద్యార్థిని తాడంగి పల్లవి(11) విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతి చెందింది. పల్లవి తండ్రి బిహనో, ఏటీడబ్ల్యువో ఆర్.కృష్ణవేణి కథనం మేరకు.. సాలూరు మండలంలోని మామిడిపల్లి గిరిజన ఆశ్రమపాఠశాలలో పల్లవి ఏడో తరగతి చదువుతోంది. గతనెల 21న దసరా సెలవులకు ఇంటికి వెళ్లినా, సెలవుల అనంతరం పాఠశాలకు చేరుకోలేదు. ఇంతలో ఈనెల ఆరో తేదీన జ్వరంగా ఉండడంతో అదేరోజు బొబ్బిలి కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో వైద్యుని సూచన మేరకు ఈనెల ఎనిమిదో తేదీన విజయనగరం ఘోషాసుపత్రికి తీసుకువెళ్లారు. ఈలోగా పాఠశాల సిబ్బంది ఆరాతీయగా అనారోగ్యంతో విశాఖ ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతోందని కుటుంబసభ్యులు చెప్పడంతో ఆసుపత్రికి వెళ్లి పల్లవి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఘోషాసుపత్రిలో అక్కడ కూడా నయంకాకపోవడంతో ఈనెల 11న విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బీపీ, జ్వరం ఎక్కువై ఫిట్స్‌లా వచ్చింది. ఆదివారం ఉదయం కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న సమయంలో కొంతమెరుగైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడింది. ఇంతలో అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం పల్లవి మృతిచెందింది. ఈ మేరకు 13న కృపావలసలో అంత్యక్రియలు నిర్వహించారు. బిహనో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పల్లవి రెండో కుమార్తె. పల్లవి మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కాగా ఈనెల ఆరోతేదీ రాత్రి పది గంటలకు పల్లవిని ఆసుపత్రికి తీసుకొచ్చారని, పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి 12 గంటలకు 108లో విజయనగరం తరలించినట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి బి.శశిభూషణరావు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సంతకవిటి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిళ్లాణి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆయన మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిళ్లాణి గ్రామానికి చెందిన కరణం సంతోష్‌కుమార్(28) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఒక చెల్లి ఉంది. అయితే తన చెల్లికి, అదే గ్రామంలో ఉన్న వ్యక్తితో కుటుంబ సభ్యులు వివాహం నిశ్చయించారు. అయితే ఆ వరుడు తనకు నచ్చలేదు. కుటుంబ సభ్యులు తన ఇష్టానికి వ్యతిరేకంగా చెల్లికి పెళ్లి నిశ్చయించారని సంతోష్‌కుమార్ మనస్తాపం చెందాడు. సోమవారం ఉదయం బయటకు వెళ్లి వచ్చిన ఆయన ఇంటి ముందు కళ్లు తిరిగి పడిపోయాడు. గడ్డి మందు తాగినట్టు గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాను పైనుంచి జారి వ్యక్తి మృతి

వీరఘట్టం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో మంగళవారం వ్యాను పై నుంచి జారిపడి ఘటనలో పెనుమాక రాజు(36) మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం నుంచి గోనె సంచుల వ్యాన్ వీరఘట్టం వచ్చింది. ఆ వ్యాన్‌తో పాటు రాజు వచ్చాడు. ఇక్కడ గోనె సంచులు దించిన తర్వాత వ్యాన్‌పైన తాళ్లు సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తూ రాజు జారిపడ్డాడు. విషయం గమనించిన స్థానికులు అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రాజు మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశామని, ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కళాధర్ తెలిపారు.

మద్యం మత్తులో మంచంపై నుంచి పడి ఒకరు..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి గ్రామానికి చెందిన కర్రి రామారావు (62) సోమవారం రాత్రి మద్యం మత్తులో మంచం పైనుంచి కిందపడడంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తెల్లవారుజామున భార్య అప్పలనరసమ్మ లేచి చూసేసరికి రక్తం మడుగులో ఉన్న భర్త రామారావును చూసి ఇరుగు పొరుగు వారిని పిలిచి విషయం తెలియజేసింది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి వెళ్లి దర్యాప్తు నిర్వహించారు. కాగా పోలీసులు వెళ్లే సరికి రామారావు మృత దేహానికి దహన సంస్కారాలు పూర్తవడంతో భార్య వద్ద వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. రామారావు మద్యం విపరీతంగా తీసుకోవడం వల్ల మృతి చెందాడని ఆయన భార్య పేర్కొన్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ సర్వేయర్..

డెంకాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతాడివాడ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం ప్రభుత్వ సర్వేయర్ ఎం.మధుకేశ్వరరావు(55) మృతిచెందినట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భోగాపురం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న మధుకేశ్వరరావు మంగళవారం ఎప్పటిలాగే విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై విజయనగరంలోని తన నివాసానికి వెళ్తున్నారు. పెదతాడివాడ సమీపంలోని మానస ఆసుపత్రి సమీపంలోకి వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆయన మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఊడికలపేటలో క్షుద్ర పూజల కలకలం



పుర్రెను పరిశీలిస్తున్న పోలీసులు

డెంకాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెదతాడివాడ పంచాయతీ ఊడికలపేట గ్రామంలో క్షుద్ర పుజల కలకలం రేగింది. దీనిపై డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊడికలపేట గ్రామానికి చెందిన పి.పైడయ్య కుటుంబీకులు సోమవారం ఉదయం లేచి బయటకు వచ్చి చూసేసరికి ఇంటి గుమ్మం ముందు మనిషి పుర్రె పూజలు చేసి ఉన్నట్టు కనిపించింది. దీంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి, పరిశీలించారు. పుర్రెను అక్కడ నుంచి తొలగించి, కల్చివేశారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఇది ఆకతాయిల పని అని, విచారణ జరిపి, పూర్తి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గుర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నడుపూరు గ్రామంలో కె.పైడినాయుడు అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. మంగళవారం ఉదయం ఆ ఆవు మేత కోసం వెళ్లగా, తెగిపడిన విద్యుత్ తీగలు కాళ్లకు తగిలాయి. దీంతో ఆవు షాక్‌కు గుర్రై మృతిచెందింది. విద్యుత్ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పశు వైద్య సిబ్బందికి తెలియజేశారు.

ఇంకెప్పుడిస్తారో?

(5వ పేజీ తరువాయి)

పరికరాల కోసం ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజన రైతులు వినతులు అందిస్తున్నారు. ఇప్పటికే 200యూనిట్లకు గాను వెయ్యికిపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇంత పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

ఎన్నాళ్లిలా?

గిరిజన రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రత్యేక ఉప ప్రణాళిక నిధులను ఖర్చు చేయకుండా ఎన్నాళ్లిలా కాలయాపన చేస్తారని గిరిజన సంఘాల నాయకులు మండిపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విధానం ద్వారా గానీ, లేదా ఆయా ఐటీడీఏల పరిధిలోని గిరిజన రైతుల రిక్వయిర్‌మెంట్(డిమాండ్) మేరకు గానీ హార్టికల్చర్, అగ్రికల్చర్ పరికరాలను కొనుగోలు చేసి సబ్సిడీపై వారికి అందించాలని డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్‌సీపీ టు టీఎస్‌ఎస్ నిధులను రైతుల కోసం వెచ్చించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొక్కజొన్న కొనేదెవరు?

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రావడం లేదని వారు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో మబ్బులు వేస్తున్నాయని, ఏ క్షణంలోనైనా వర్షం వచ్చి గింజలు తడిచిపోతాయేమోనని ఆందోళనగా ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రతి రైతూ వ్యాపారవేత్తగా ఎదగాలి

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 67వేల ఎకరాల్లో రైతులు సంప్రదాయ సేద్యం చేస్తున్నారని అన్నారు. ఉద్యాన పంటల్లో కూడా మంచి మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది జిల్లా అభివృద్ధిలో వ్యవసాయ, ఉద్యానవన రంగాలు కీలకపాత్ర పోషించనున్నట్టు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ వృద్ధిని చూడబోతున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, ఉద్యానశాఖాధికారి కె.సత్యనారాయణరెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.మన్మథరావు, ఏడీఏ జి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువు

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన మాత్రం చేయడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో గానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గానీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

శరవేగంగా..

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. అలాగే 3, 4 ప్లాట్ ఫామ్‌లు మధ్య నిర్మించిన ఫుట్‌పాత్ స్టెప్స్ వెడల్పు చాలా తక్కువగా ఉండడంతో రద్దీగా ఉన్న సమయంలో రాకపోకలకు ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దివ్యాంగుల కోసం ఏ విధమైన ప్రత్యేక సదుపాయాలు లేవు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో విశ్రాంతి గది, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీటిపై రైల్వే అధికారులు దృష్టి సారించి అన్ని రకాల వసతులతో అత్యాధునిక రైల్వే స్టేషన్‌గా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వలంటీర్లు లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లు లక్ష్యాలను అధిగమించాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. జిల్లా వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రచురించిన పుస్తకాలను సరఫరా చేయనున్నామన్నారు. ఇందులోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి వారికి ప్రాథమిక అవగాహన పెంచాలని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ నాయకులు బాణాల సురేష్, అక్కేన రామకృష్ణ, ఏపీఎం వి.అప్పలనాయుడు, సీసీలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

●వీరఘట్టం: శతశాతం అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉల్లాస్ స్వచ్ఛంద వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 400 మంది వలంటీర్లు గుర్తించామన్నారు. ఒక్కొక్కరు 10 నుంచి 15 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయనున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్యంనాయుడు, ఏపీఎం కెల్ల రాము పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభమైంది. వెలుగు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మహిళల్లో ఆరోగ్యం

రామభద్రపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విమలారాణి తెలిపారు. మంగళవారం రామభద్రపురంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాలకు కాలం చెల్లిన సరుకులు వస్తే తీసుకోకుండా రేషన్ డీలర్ వద్దే ఉంచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు పోషణ్ అభియాన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): చింతాడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ వై.రాజు స్థూలకాయం నివారణ, చక్కెర, నూనెలు వినియోగం తగ్గించడం, బాల్య దశ సంరక్షణ తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బంకురు తిరుపతిరావు, హెచ్‌ఎం షణ్ముఖరావు, అనంత భవానీ తది తరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దండి

●కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, అంగన్‌వాడీ వర్కర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మరింత పెరగాలన్నారు. పిల్లల ఆరోగ్యం అతి ముఖ్యమని, దానికి అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం అందించాలన్నారు. మానసిక ఆరోగ్యం, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన, సీజనల్ వ్యాధులు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించి అద్దం, సబ్బు, దువ్వెన, టవల్, బకెట్, హ్యాండ్ వాష్ అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, విద్యాశాఖాధికారి శంకర్, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైశాలి

మక్కువ రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సబ్ కలెక్టర్ వైశాలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిని ఆసాంతం పరిశీలించారు. పరిశుభ్రతను విధిగా పాటించాలని ఆమె వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మక్కువలోని రేషన్ షాపును ఆమె తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ విధానాన్ని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.భరత్ కుమార్‌ను ఆదేశించారు. తొలుత ఆమె మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. భూముల రీసర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలని తహసీల్దార్‌ను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

భూముల రీసర్వే పూర్తికి ప్రత్యేక చర్యలు

పాచిపెంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పూర్తికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి తెలిపారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రెండు ఫేజ్‌ల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మూడో ఫేజ్‌లో రీసర్వే మరింత వేగవంతం చేస్తామన్నారు. పాచిపెంట మండలంలోని ఏడు గ్రామాల్లో సర్వే త్వరలో పూర్తిచేస్తామన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ జిల్లాలో 28 శాతం పూర్తయిందన్నారు. సాలూరు, పాచిపెంట మండలాల్లో 50 శాతంపైగా పంపిణీ జరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పరిశ్రమలకు సంబంధించిన స్థలాలపై తహసీల్దార్ రవితో మాట్లాడారు. కొటికిపెంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 210లో భూమిని అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి సమగ్ర నివేదిక అందజేయాలని తహసీల్దార్‌ను ఆమె ఆదేశించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

బెలగాం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం కూటమి నాయకులు పంపిణీ చేశారు. పట్టణంలోని రేషన్ డిపో నెం.425 పరిధిలోని లబ్ధిదారులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, డి.బోదయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలు జరగకుండా ఉండేందుకు స్మార్ట్ కార్డులను ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో దుర్గారావు, గణేష్, ఎం.సత్యనారాయణ, వీఆర్వో సత్యం, డీలర్ తవిటిరాజు, జి.శివ తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రో పవర్' అనుమతులు రద్దు చేయండి

మక్కువ రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరులో పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ డిమాండ్ చేశారు. మంగళవారం దుగ్గేరులో పనసభద్ర పంచాయతీలోని గిరిజనులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గేరులో పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడం వల్ల గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు. మంత్రి మండలి ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్టును రద్దు చేయాలన్నారు. 2 వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టు దుగ్గేరులో ఏర్పాటు చేయడం వల్ల కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి, గిరిజనుల భూములకు సాగునీరు అందించే సురాపాడులో మినీ రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టిసారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు కూలీ సంఘం నాయకులు ఊయక ముత్యాలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు నిలువ నీడేదీ?



ఆరుబయట వాహనాల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

వీరఘట్టం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో బస్సు షెల్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. జూనియర్ కళాశాల సెంటర్, అంబేద్కర్ జంక్షన్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ప్రయాణికులు వేచి ఉండేందుకు అవస్థలు పడుతున్నారు. ఆరుబయట రోడ్డుపైనే వాహనాల కోసం నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇకనైనా పాలకులు స్పందించి బస్సు షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

కేంద్రమంత్రిని కలిసిన విజయచంద్ర



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి ఒప్పందం నేపథ్యంలో ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. పార్వతీపురం జిల్లాలో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని, రోడ్లు అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే విజయచంద్ర.. కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వమంగళదేవి పీఠంలో ఎమ్మెల్యే పూజలు

పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వమంగళదేవి పీఠాన్ని మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన సందర్శించారు. పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసుశర్మ ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వమంగళదేవి పీఠం దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

లింగ వివక్ష తగదు



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో సీడీపీవో

సీతంపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో లింగ వివక్ష తగదని సీతంపేట ఐసీడీఎస్ సీడీపీవో సిమ్మాలమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐసీడీఎస్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో 40 శాతం బాలికలే ఉన్నారన్నారు. బాలికలు సెల్ఫ్ డిఫెన్స్, లైఫ్ స్కిల్స్‌పై దృష్టిసారించాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉన్ననాడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గౌరి, వెంకటలక్ష్మి, కేజీబీవి ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన అధికారి

సీతానగరం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం మన్యం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో మాట్లాడారు. సిలబస్, వీకెండ్ టెస్ట్‌ల ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధాన రాబెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల హాజరు, తాగునీరు, పరిసరాల శుభ్రతపై పలు సూచనలు చేశారు.

సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

సీతానగరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రజలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి కోరారు. మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం దుకాణాల నుంచి నుంచి కొనుగోలు చేసిన ప్రతి బాటిల్‌ను నిర్దేశించిన యాప్ ద్వారా స్కాన్ చేసుకుని మద్యం నాణ్యతను తనిఖీ చేసుకోవాలన్నారు.

విద్యార్థినులకు మంత్రి పరామర్శ



విద్యార్థినితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులను మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పరామర్శించారు. అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ విద్యార్థినులు అందరూ సురక్షితంగా ఉన్నారన్నారు. త్వరలోనే విద్యార్థినులను డిశ్చార్జ్ చేస్తారన్నారు. విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. మంత్రితో పాటు డీడీ విజయశాంతి, ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

'గూగుల్' ఒప్పందంపై సంబరాలు



టపాసులు కాలుస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గూగుల్ టెక్ సంస్థ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌కు ఢిల్లీలో మంగళవారం ఎంవోయూ జరిగిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు ప్రభుత్వ విప్ జగదీశ్వరి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జగదీశ్వరి మాట్లాడుతూ విశాఖ నగరాన్ని టెక్‌హబ్‌గా మార్చి ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, కొమరాడ మండల పార్టీ అధ్యక్షుడు సేనాపతి శేఖర్ పాత్రుడు, మహిళా మండల అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటరావు, బీజేపీ నాయకులు దొరబాబు, చిన్న రాజేష్, జనార్దన్, రామారావు, నాగేశ్వరరావు, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

●సాలూరు: విశాఖపట్నంలో గూగుల్ కంపెనీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు మంగళవారం ఒప్పందం కుదుర్చుకోవడంతో పట్టణంలో టీడీపీ శ్రేణులు బాణసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటరమణ, కాళ్ల శ్రీను, హర్ష, బృందావనం అశోక్, కొనిశెట్టి భీమారావుతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో చోరీ

పాలకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని సాయిబాబా గుడి వెనుక రామినేని వాసు, కనకల గణేష్‌కు చెందిన స్క్రాప్ దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రాగి, ఇత్తడి తదితర సామగ్రి అపహరణకు గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సారాతో ఇద్దరి అరెస్టు

కురుపాం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం తాళ్లదుమ్మ, అల్లువాడ గ్రామాల పరిధిలో సారా అమ్ముతున్న చినమేంగి గ్రామానికి చెందిన వెలగాడ చందు, బొమ్మల నవీన్‌లను మంగళవారం అరెస్టు చేశామని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి 120 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరికి సారా సరఫరా చేసిన వారిపై విచారణ చేస్తామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారని సీఐ తెలిపారు.

కొత్తపేట జంక్షన్‌లో ఒకరు..

సీతంపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో కె.సూర్యనారాయణ సారాతో పట్టుబడ్డారని ఎస్‌ఐ మస్తాన్ తెలిపారు. అతడి నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థికి అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడికొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి దేవేంద్ర మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. విషయాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు తాడికొండ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. ప్లేట్‌లెట్స్ తగ్గినట్టు తెలుసుకుని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు విద్యార్థిని తరలించారు.

పీఎన్‌డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయండి

బొబ్బిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు బాలికల లింగ నిష్పత్తిని పెంచేందుకు లింగ నిర్ధారిత పరీక్షల నిరోధక చట్టాన్ని (పీసీ అండ్ పీఎన్‌డీటీ) పగడ్బందీగా అమలు చేయాలని ఆర్డీవో రామ్మోహనరావు కోరారు. మంగళవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుపై డివిజనల్ స్థాయి వైద్యాధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి సంతోషికుమారి, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు సంధ్య, ఏఎస్‌ఐ బీవీ స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రామకుమారి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు చేపడితే చర్యలు

మక్కువ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ములక్కాయవలస రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 91లోని బోడిమెట్టపై జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ కె.భరత్‌కుమార్ సీరియస్ అయ్యారు. బోడిమెట్టపై గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయాన్ని తెలుసుకున్న ఆయన స్పందించారు. ఇకపై బోడిమెట్టపై అక్రమ తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి



సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

కురుపాం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారుల పనితీరు బాగులేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపై అధికారులు పనితీరు మార్చుకోవాలని ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. అధికారులు గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పై శ్రద్ధ చూపకపోవడం వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. ఇప్పటికైనా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. గిరిశిఖర గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు నేటికీ పూర్తి చేయకపోవడంపై ఐటీడీఏ ఏఈ అప్పారావుపై పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన రోడ్లు పూర్తి చేయాలని కోరారు. అలాగే పలు గ్రామాలలో విద్యుత్ సమస్యలను పరిష్కారించాలని, ఉపాధి బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నిషారు, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ జయ తదితరులు పాల్గొన్నారు.